క్లుప్తంగా

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక గాంధీ చౌక్‌లో ఉన్న ఇనోదయ ఆస్పత్రిలో ఈ నెల 11, 12 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సామర్లకోట ఇనోదయ ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ జి.రామ్మోహన్, డాక్టర్ వీఎల్ దేవిలు జీర్ణ కోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థి ప్రభాస్‌కు అభినందన



ప్రభాస్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కొత్తపల్లి: ఇటీవలి పదో తరగతి పరీక్షల్లో యండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 582 మార్కులు సాధించిన స్వాలిరెడ్డి గంగా ప్రభాస్‌ను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి, పాఠశాల హెచ్‌ఎం కేవీకే రామాచార్యులు జిల్లా విద్యాశాఖ అధికారిణి అన్నపూర్ణ పాల్గొన్నారు.

మహాయజ్ఞంపై ప్రచారం ప్రారంభం



సామర్లకోట పంచారామ క్షేత్రం వద్ద ప్రారంభించిన ప్రచారం

సామర్లకోట: విజయవాడలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్న శ్రీలక్ష్మి మహాయజ్ఞంపై పంచారామ క్షేత్ర అధికారులు బుధవారం ప్రచారం ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నవరం సత్యనారాయణమూర్తి కల్యాణం నిర్వహించాలని నిర్ణయించడంతో ఈ మేరకు భక్తులకు సమాచారం అందించేందుకు ప్రచార రథాన్ని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

14న హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: ఈ నెల 14వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జీవీకే మోహనరావు, కర్రి ఆదినారాయణరెడ్డిలు తెలిపారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి నవదుర్గ ఆలయం, ప్రతిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట సెంటర్, పాత తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి చేరుతుందన్నారు. ర్యాలీలో పెద్దాపురం, సామర్లకోటకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొనేవారు 94938 39665, 70138 07744 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కాలుష్య జలాలను పరిశీలించిన అధికారులు



సామర్లకోట గోదావరి కాలువను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: పీబీ దేవం నుంచి సామర్లకోట వరకూ ఉన్న గోదావరి కాలువ కాలుష్య జలాలతో నిండిపోయిందని జిల్లా కలెక్టరుకు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇరిగేషన్, జిల్లా పంచాయతీ అధికారులు సదరు కాలువను బుధవారం పరిశీలించారు. గోదావరి కాలువలో నీరు నలుపు రంగులో మారిపోవడానికి కాలుష్య జలాలు వస్తున్న ప్రదేశాలపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల నుంచి సమాచారం సేకరించారు. పీబీదేవం నుంచి హుస్సేన్‌పురం వరకూ గ్రామాల నుంచి వస్తున్న వ్యర్థ జలాలు గోదావరి కాలువలోనే కలుస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నీటి శ్యాంపిల్ సేకరించారు. కార్యక్రమంలో డీపీఓ ఆర్.విక్టర్, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీరు ఎస్.అశోక్‌కుమార్, ఈఓపీఆర్డీ వై.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత శస్త్రచికిత్సలు

పిఠాపురం: నిరుపేదలకు వివిధ శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ కర్నాసుల విష్ణుమూర్తి తెలిపారు. పడిపోవడం వల్ల ముఖానికి అయిన గాయాలకు, గ్రహణం మొర్రి, పుట్టుకతో వచ్చిన లోపాలను సవరించడం, బ్రెస్ట్‌కు సంబంధించిన, అన్ని రకాల కంతులకు తదితర రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 వరకు ఎటువంటి ఫీజు లేకుండా రోగులను పరీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. పిఠాపురం రామా టాకీస్ సెంటర్లో కుమారస్వామి గుడి ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో సంప్రదించాలని ఆయన కోరారు.

పూడిక తొలగిద్దాం.. పునర్వైభవం తెద్దాం..

- పంచారామ క్షేత్రంలో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం
- కోనేరులో పూడికతీత పనులు ప్రారంభం



సామర్లకోట పంచారామ క్షేత్రం కోనేరులో నీరు తొలగించడానికి ఏర్పాటుచేసిన ఇంజను

సామర్లకోట: చాళుక్యుల శిల్పకళా నైపుణ్యంతో, విశాలమైన ప్రాకారాలతో, నాలుగు ద్వారాలతో, కోనేటి జలాలతో అలరాలే పుణ్యక్షేత్రం సామర్లకోట బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం.. 9వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయ కోనేరులో భక్తులు కాళ్లు శుభ్రం చేసుకుని దైవ దర్శనానికి వెళ్లడం పరిపాటి. అయితే గోదావరి కాలువ నీటితో నింపుతుండడంతో కోనేరు జిగురుమట్టితో నిండిపోయింది. దీర్ఘకాలంగా నెలకొన్న ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు ట్రస్ట్ బోర్డు సభ్యుల చొరవ ఫలించింది. కోనేరులో పూడిక తొలగించడానికి కేంద్ర పురావస్తుశాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా పనులు ప్రారంభించారు.

నాటి పాలకవర్గం స్పందించలేదు

కోనేరులో జిగురు మట్టి తొలగించాలని గత పదేళ్లగా భక్తులు కోరుతున్నా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకవర్గం పట్టించుకోలేదు. కోనేరులో పూడిక తొలగించి దిగువ భాగంలో ఇసుక వేస్తే నీరు స్వచ్ఛంగా ఉంటుందని భక్తులు ఎప్పటినుంచో కోరుతున్నారు. అప్పట్లో కేవలం కోనేరు చుట్టూ రివిటింగ్ చేసి చేతులు దులుపుకున్నారు. కోనేరులో జిగురు మట్టిని పూర్తిగా తొలగించి దిగువ భాగంలో ఇసుక వేయడానికి తన వంతు సహాయంగా రూ.10 లక్షలు ఇస్తానని ఏడేళ్ల క్రితం ఒక భక్తుడు ప్రకటించినా పాలకులు స్పందించలేదు. వేసవి సెలవుల్లో కోనేరులో ఉన్న మండపం నుంచి దూకి జిగురు మట్టిలో కూరుకుపోయి నలుగురు చిన్నారులు మృతి చెందినా గత పాలకుల్లో స్పందన లేకపోయింది.

రూ.35 లక్షలు మంజూరు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పంచారామ క్షేత్ర నూతన ట్రస్టు బోర్డు సభ్యులు కోనేరుపై దృష్టి సారించారు. ఆలయానికి వచ్చిన ఎంపీలతో పాటు కేంద్ర పురావస్తు శాఖ అధికారులకు కోనేరులో జిగురు మట్టి తొలగించే పనులు చేయించాలని కోరారు. దీంతో కేంద్ర పురావస్తు శాఖ ఆలయ కోనేరులో పూడిగ తొలగించడానికి ఒప్పుకుంది. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో కోనేటిలో నీటిని తొలగించి పూడిక తొలగించే పనులు ప్రారంభించారు. పంచారామ క్షేత్రంలో అభివృద్ధి పనులు నిర్వహించడానికి రూ.35 లక్షలు మంజూరయ్యాయని పురావస్తుశాఖ కాకినాడ సీఏ కేవీవీఎస్ఎస్ మూర్తి చెప్పారు. కోనేరు అభివృద్ధికి ఎంత ఖర్చవుతుందో ముందుగా అంచనా వేయలేమని, పూడిక ఎంత లోతుగా తీస్తే అంత లోతుగా ఇసుక వేస్తామన్నారు.

కోనేరు చుట్టూ మెట్లు నిర్మించాలి



గతంలో కోనేరు రివిట్‌మెంట్ చేసినపుడు నాసిరకంగా చిన్న మెట్లు నిర్మించారు. దాంతో భక్తులు మెట్లపై నిలబడడానికి అవకాశం లేని పరిస్థితి నెలకొంది. కోనేరులో పూర్తిగా పూడిక తీసి ఇసుక వేయాలి. కోనేరు చుట్టూ మెట్లు నిర్మించాలి.

– యండమూరి వెంకటసుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యుడు, సామర్లకోట

పురావస్తుశాఖ ఆధ్వర్యంలోనే పనులు



కోనేరులో నీరు పూర్తిగా తీసేసి ఎండిపోయిన తరువాత పూడిక తొలగించి దిగువభాగంలో ఇసుకతో నింపాల్సి ఉంది. ఈ పనులను కేంద్ర పురావస్తు శాఖ అధికారులే నిర్వహిస్తున్నారు.

– డి.నాగమల్లేశ్వరరావు, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు శీలంవారిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినవారి కుటుంబాలకు బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతి చెందిన కర్రి వీరాస్వామి, కలగల చంద్రరావు, పందిరి రమణల కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికీ రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మాజీ ఎంపీటీసీ శీలం చంటిబాబు, ఉమ్మిడి చిన్న, బండి ఉదయ్‌కుమార్, దడాల రాజబాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు

సామర్లకోట: ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పీబీదేవం శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ అన్నారు. స్థానిక సేవా సమితిలో బుధవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ 1960లో ప్రారంభమైన శారదా రామకృష్ణ సేవా సమితి 63 ఏళ్లుగా వివిధ రకాల సేవలందిస్తుందన్నారు. ప్రతి నెలా పేదలకు బియ్యం అందజేతతో పాటు, ఉచిత వైద్య శిబిరాలు, పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేత తదితర కార్యక్రమాలు జరుపుతున్నామన్నారు. ప్రస్తుతం 50 మంది ఆదర్శ యువతతో సేవా సమితిని నిర్వహిస్తున్నామని చెప్పారు.

తపాలా ఉద్యోగుల సంఘం గుర్తింపును పునరుద్ధరించాలి

కాకినాడ సిటీ: పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై బుధవారం స్థానిక జిల్లా సీఐటీయూ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కేంద్ర కార్మిక సంఘాలు పాల్గొని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గుర్తింపును పునరుద్ధరించేంత వరకు పోరాడాలని పోస్టల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వంతో కార్మికులు పోరాడి సంఘం పెట్టుకునే హక్కును 1926లో సాధించి, మొట్టమొదటి రిజిస్టర్ చేసిన సంఘం పోస్టల్ ఉద్యోగులలో 70 శాతం సభ్యత్వం కలిగిన ఉద్యోగుల గుర్తింపును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసంబద్ధ కారణాలతో రద్దు చేయడం ట్రేడ్ యూనియన్ 1926 చట్టానికి వ్యతిరేకమని, ఇది కార్మికుల పట్ల, ఉద్యోగ సంఘాల పట్ల ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కేంద్ర కార్మికసంఘాల ప్రతినిధులు దువ్వా శేషబాబ్జీ, జె.వెంకటేశ్వరరావు, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కథలు పిల్లల ఆస్తులు



చిన్నారులనుద్దేశించి ప్రసంగిస్తున్న రచయిత కృష్ణశ్రీ

పెద్దాపురం: కథలు పిల్లల ఆస్తులని, కథలు చెప్పడం, రాయడంలో వారికి స్వేచ్ఛనివ్వాలని బాలల కథా రచయిత కృష్ణశ్రీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణశ్రీ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ పిల్లలు నీతి కథలను వినడం, చెప్పడం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శిబిరంలో విద్యార్థులకు కరాటేపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌సీ మూర్తి, దుంగల పూజిత, సూర్యశ్రీ, శ్యామ్‌కుమార్‌లు పలు అంశాలపై శిక్షణనిచ్చారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో...

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం వేమన పద్యాలు, సమయపాలన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి శిక్షణలో ప్రతి విద్యార్థి మరింత పరిజ్ఞానం అలవరచుకోవాలని సాహితీ స్రవంతి అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, పెద్దాపురం పట్టణ కార్యదర్శి కొత్త శివ, సమ్మర్ క్యాంప్ ఉపాధ్యాయురాలు వాడపల్లి విమలారాణి అన్నారు.

గ్రంథాలయంలో కొనసాగుతున్న శిబిరం

సామర్లకోట: స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి ప్రత్యేక శిబిరాన్ని బుధవారం కొనసాగించారు. ఇంగ్లిష్ గ్రామర్‌తో పాటు జాతీయ నాయకుల జీవిత చరిత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని గ్రంథాలయాధికారిణి బందిల రత్నమణి తెలిపారు.

మహాయజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు తదితరులు

పెద్దాపురం: ఆంధ్ర రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్న మహాయజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు, జిల్లా దేవాదాయ శాఖాధికారి పి.నారాయణమూర్తి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం యజ్ఞదీక్షను చేపట్టిందన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిత్యం పూజలు, హోమాలు, కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 17వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో యజ్ఞదీక్ష ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, మహారాణి సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, మరిడమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ సీహెచ్‌వి రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి ఆర్వో ప్లాంటు

సాక్షి ఇంపాక్ట్



ఆర్వో ప్లాంటును ప్రారంభించిన కౌన్సిలర్లు

సామర్లకోట: ఇటీవల సాక్షి దినపత్రికలో 'నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. స్థానిక గణపతినగరంలోని ఆర్వో ప్లాంటును సుమారు రూ.50 వేలు ఖర్చుతో మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్ పలువురు కౌన్సిలర్లతో కలిసి ఆర్వో ప్లాంటును బుధవారం ప్రారంభించారు. 27, 28, 29, 30, 31 వార్డుల ప్రజలకు ఉపయోగపడే ఆర్వో ప్లాంటు అందుబాటులోకి రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, మత్రి శేషారావు, నక్కా లలిత, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, మున్సిపల్ ఏఈ ఆనంద నాగసాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు కురిపిస్తున్న భానుడు



నిర్మానుష్యంగా సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

- మండే ఎండలకు హడలిపోతున్న ప్రజలు

సామర్లకోట: వేసవి కాలంలో రోహిణి ప్రారంభం కాక ముందే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇటీవల తుఫాను ప్రభావంతో కొద్దిరోజులు వర్షాలు కురవడంతో ప్రజలు కొంత మేర సేదతీరారు. అయితే గత మూడు రోజులుగా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. బుధవారం సామర్లకోటలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. దీనికి తోడు వేడి గాల్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపుల్లోకి ఎండగా నేరుగా పడుతుండడంతో వేడికి తాళలేక అనేకమంది వ్యాపారులు తమ షాపులను మూసేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ పెళ్లిముహూర్తాలు సైతం ఎక్కువగా ఉండడంతో మండే ఎండలోనే విందు భోజనాలకు హాజరవ్వాల్సి వస్తోంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు భానుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా మారింది.

ప్రపంచ వారసత్వంపై అవగాహన

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజినీరింగ్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచం మీ వారసత్వం కోసం ఎదురు చూస్తోంది అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పూర్వ విద్యార్థి, డాక్టర్ నాగిరెడ్డి హాజరై లక్ష్య సాధన, పోరాట పటిమ, విద్యార్థులు నేర్చుకోవలసిన మెళకువలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- రోటరీ యూత్ సర్వీసెస్ చైర్మన్ రమణారావు
- మహిళల హాకీ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రోటరీ యూత్ సర్వీసెస్ మంత్‌లో భాగంగా యువతకు నైపుణ్యాలను పెంపొందించేందుకు పలు క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ యూత్ సర్వీసెస్ చైర్మన్ టీవీ రమణారావు పేర్కొన్నారు. బుధవారం క్లబ్ ప్రెసిడెంట్ సురభిశారద ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలోని హాకీ మైదానంలో మహిళలకు టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ధరణి కన్‌స్ట్రక్షన్స్ అధినేత రమణారావు మాట్లాడుతూ యువతకు వారి వారి క్రీడల్లో నైపుణ్యాలు వృద్ధి చేయడానికి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. హాకీ కోచ్ రవిరాజు మాట్లాడుతూ టోర్నీ నిర్వహిస్తున్న రోటరీ సభ్యులను అభినందించారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులు బెలూన్లు ఎగురవేసి, శాంతి కపోతాలను గాలిలోకి వదిలి, ఫ్రీహిట్ గోల్స్ వేసి టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పాస్ట్ గవర్నర్ టిక్కు, ఎలక్ట్ ప్రెసిడెంట్ గోపు కాశీవిశ్వనాథ్, సెక్రటరీ కోనాడ ప్రకాశరావు, సభ్యులు రిక్కి గూటం, స్వరాజ్, డాక్టర్ విజయ కృష్ణ, సలాది సూర్య కిరణ్, బ్లూస్టార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- ఎంపీ వంగా గీత
- కుంభాభిషేకం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం



కుంభాభిషేకం వద్ద బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

కాకినాడ: మత్స్యకారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక అచ్చంపేట జంక్షన్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రూ.149 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన నాలుగు లైన్ల జాతీయ రహదారిలో భాగంగా కుంభాభిషేకం వద్ద ప్రతిపాదించిన బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కేఎస్‌పీఎల్ ఎండీ కేవీ రావు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపీ గీత మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు తమ హయాంలో ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. మత్స్యకార భరోసాతో పాటు అగ్నికుల క్షత్రియ, వాడబలిజ మత్స్యకారులకు సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధిని ఓర్వలేక వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుంభాభిషేకం రేవును తరలిస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పోర్టు విస్తరణలో భాగంగా కుంభాభిషేకం రేవు వద్ద ఉన్న 34 చిన్న చిన్న కట్టడాలను సమీప ప్రాంతానికి నష్టపరిహారం ఇచ్చి మరీ తరలిస్తున్నామని, అయితే దీనిని కూడా రాజకీయం చేసి తప్పుదారి పట్టించేందుకు వనమాడి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి సత్యప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ కార్పొరేటర్ గద్దేపల్లి దానమ్మ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–స్టాంపింగ్ చట్టబద్ధమే

- నాన్ జ్యుడీషియల్ స్టాంప్ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ నాగలక్ష్మి

కాకినాడ లీగల్: అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజు రిజిస్ట్రేషన్లకు స్టాంప్ పేపర్లే అక్కర్లేదని, ఈ–స్టాంపింగ్ అయినా చట్టబద్ధమేనని ఉమ్మడి జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ జుడిషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఈ–స్టాంపింగ్ విధానంలో కూడా అవసరమైన నాన్ జుడీషియల్ స్టాంపులను పొందవచ్చన్నారు. ఈ స్టాంపింగ్ ద్వారా వేయబడిన స్టాంపులు, సాధారణ నాన్ జుడీషియల్ బాండ్ పేపర్లతో సమానంగా చలామణి అవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజల తమ సమీపంలోని ఇ– స్టాంపింగ్ కేంద్రాలు, లైసెన్స్ వెండర్ల వివరాలను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజిస్ట్రేషన్.ఏపీ.జీవోవీ.ఇన్'లో తెలుసుకోవచ్చన్నారు. కాకినాడ డీఐజీ పరిధిలో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ రిజిస్ట్రేషన్ జిల్లాల్లో విస్తరించిన అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజల ఉపయోగార్థం నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పది, ఇరవై, యాభై, వంద రూపాయల విలువ గల స్టాంపులు అయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కౌంటర్లలోనూ, అధీకృత స్టాంపు వెండర్ల వద్ద లభ్యమవుతాయని, నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు.

వృక్ష విలాపం



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నరికిన వృక్షాలు

- అటవీ, విద్యుత్ శాఖల మధ్య లోపిస్తున్న సమన్వయం
- తలలు బోడులై మొండేలుగా మిగులుతున్న వైనం

కొత్తపల్లి: రెండు శాఖల సమన్వయ లోపంతో విలువైన వృక్ష సంపద నేలకు ఒరుగుతోంది. అటవీ, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయం లోపం ఈ పరిస్థితికి కారణమవుతోంది. కష్టపడి పెంచిన మొక్కలపై అటవీ శాఖ అధికారులకు ప్రేమ లేకపోవడం ఒక తీరైతే, ఒకరికి వెలుగులు నింపేందుకు పచ్చని చెట్ల ప్రాణం తీయడమే పనిగా పెట్టుకునే విద్యుత్ శాఖది మరొక తీరు. మండలంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా దర్శనమిస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలను యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నారు. మొక్కలు నాటినప్పుడు నోరుమెదపని విద్యుత్ అధికారులు నేడు విద్యుత్ లైన్ల కోసం చెట్లను తెగనరుకుతున్నారు. ప్రభుత్వాలు కోట్లాది రూపాయిలు వెచ్చించి ఏటా లక్షలాది మొక్కలు నాటుతుంటే అవి నాటడం వెనుక ఉన్న లక్ష్యాన్ని విస్మరించి ఇష్టమొచ్చినట్టు నరకడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.